





# అనంత ప్రభ

తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి

5

శుక్రవారం 05 సెప్టెంబర్ 2025


# సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు భారీగా ఏర్పాట్లు

- వైసీపీ దుష్ప్రచారానికి సమాధనం అనంతపురం నుంచి ఇస్తాం
- ఎమ్మెల్యే దగ్గుపాటి, రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకుల వెల్లడి
- సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభా ఏర్పాట్లను పరిశీలించిన నేతలు



అనంతపురం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం ఈనెల 10న అనంతపురం నగరంలో నిర్వహించబోతున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభ టిడిపి పార్టీ నిర్వహించనుంది. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతుండగా రాష్ట్ర, జిల్లా నాయకులు వీటిని పరిశీలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో నాయకులంతా ఈ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించి.. నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, గుంటూరు మేయర్, టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లు మాట్లాడుతూ రెండేళ్లలో తొలిసారి రాష్ట్రస్థాయి కార్యక్రమం జిల్లా కేంద్రంలో జరుగుతోందన్నారు. 10వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా ఎమ్మెల్యేలంతా వస్తారన్నారు. ఈ సభను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తామని దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. నిన్నటి వరకు సూపర్ సిక్స్ పథకాలపై వైసీపీ దుష్ప్రచారం చేసిందని.. ఇప్పుడు హామీల అమలు తర్వాత కొత్త విష ప్రచారాలకు తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత అంటూ ప్రచారం మొదలు పెట్టారని.. ఎక్కడా యూరియా కొరత అనేది లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారో దేశమంతా చూస్తోందన్నారు. ఈ సభ ద్వారా తాము ఏం చేశామన్నది దేశం మొత్తం తెలిసేలా చెప్తామన్నారు. రాయలసీమ వాసుల కోరిక మేరకు అనంతపురం జిల్లాలో సభ నిర్వహిస్తున్నట్లు అబ్జర్వర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఇక్కడ 14 స్థానాలు టీడీపీ గెలిచిందని.. పార్టీ ఎప్పుడు ఏ కార్యక్రమం చేపట్టిన దిగ్విజయంగా పూర్తి చేస్తారన్నారు. అందుకే ఈ ప్రాంతంలో ద్వారానే సూపర్ సిక్స్ పథకాలు ఏ విధంగా సూపర్ హిట్ అయ్యాయన్నది వివరిస్తామన్నారు. మరోవైపు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ సభ విజయవంతం చేయడం మా బాధ్యత అని అన్నారు. అలాగే ప్రజలకు కూడా పెద్ద ఎత్తున తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నిరుస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో త్వరలో రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ తరఫున నిధులు పెద్ద ఎత్తున వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. ప్రజలకు ఒక సందేశం ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సురేంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు ఫిరోజ్ అహ్మద్, మోహన్ కుమార్, సంగా తేజస్విని, వడ్డే భవాని, నెట్టెం బాలకృష్ణ, డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అనంతపురం మరియు పుట్టపర్తి జిల్లాలలోని మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సమీక్షా సమావేశం




అనంతపురం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం నందు అనంతపురం జిల్లా మలేరియా అధికారి డి ఓబులు గారి అధ్యక్షతన జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రామ్ కింద అనంతపురం మరియు పుట్టపర్తి జిల్లాలలోని మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించ డం జరిగింది.
మలేరియా సబ్ యూనిట్ అధికారులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీజనల్ వ్యాధుల పైన గ్రామాలలో పర్యటించి వైద్య ఆరోగ్య సిబ్బంది ,గ్రామ సచివాలయ సిబ్బంది ,గ్రామపంచాయతీ ,మున్సిపాలిటీ అధికారుల సమన్వయంతో క్షేత్రసాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని అలాగే ఉమ్మడి జిల్లా అంతట అన్ని గ్రామాలలో వైద్యా ఆరోగ్య శాఖసిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు .అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రగులుతున్నందున ఈ తరుణంలో దోమ కాటు వలన సంభవించే డెంగ్యూ ,మలేరియా ,చికెన్ గునియా తదితరవ్యాధులు ప్రబలకుండా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలలో హెల్త్ అసిస్టెంట్లు పర్యటించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మరియు మండల పరిషత్ అధికారులకు ఈవోఆర్డి గ్రామం సచివాలయం సిబ్బందికి గ్రామపంచాయతీ అధికారులకు మరియు మున్సిపల్ శాఖ అధికారులకు గ్రామాలలో ఆరోగ్య సమస్యలు వ్యాధుల పరంగా వివరిస్తూ పారిశుద్ధ్య పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వారితో మమేకమై ముక్కుమ్మడిగా అధికారులందరూ సంఘటితంగా వ్యాధులు రాకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని ఉమ్మడి జిల్లా మలేరియా నివారణాధికారి ఓబులు సమావేశంలో సిబ్బందికి సూచించారు .ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలలో పలుచోట్ల గతంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి మరియు హెల్త్ అసిస్టెంట్లకు సీజనల్ వ్యాధుల పరిరక్షణ నిమిత్తమై శిక్షణ కార్యక్రమంలో భాగంగా మలేరియా డెంగ్యూ తదితర వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు గురించి శిక్షణ కార్యక్రమాలు వారికి నిర్వహించే వ్యాధి లక్షణాలు ముందు జాగ్రత్త చర్యలను గూర్చి తెలియజేయడం జరిగిందన్నారు రాష్ట్ర శాఖ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మరియు మున్సిపల్ శాఖ అధికారులు తెలియజేసిన పలు సూచనలు సలహాలను సమావేశంలో సిబ్బందికి ఉమ్మడి జిల్లా మలేరియా నివారణాధికారి తెలియజేశారు ,అలాగే ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే సిబ్బంది నిర్వహించేటప్పుడు ఐదు జ్వరం కేసుల కంటే ఎక్కువ ఉంటే సంబంధిత అధికారులు వెంటనే తమ దృష్టికి తెచ్చి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీహెచ్వోలు గిరిధర్ రెడ్డి ,బత్తుల కోదండరామిరెడ్డి ,నాగేంద్ర ప్రసాద్ ,మునాఫ్ ,తిరుపాలయ్య ,మద్దయ్య ,ప్రభాకర్ ,శమీ ఉల్లా ,రామకృష్ణ ,శ్రీనివాసరావు ,జయరాం నాయక్ దేవలాల్ నాయక్ శివయ్య గోపి నాయక్ రామాంజనేయులు లక్ష్మీ నాయక్ హెల్త్ సూపర్వైజర్లు లోకేశ్వర్ రెడ్డి మధు శ్రీధర్ నూర్ భాషా మహబూబ్ బాషా ,రమేష్,శశిధర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా ను సిద్ధం చేయండి



ఆత్మకూరు, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం
ముఖ్యంగా రైతులకు ఖరీఫ్ సీజన్లో యూరియా అవసరము అవుతుందని యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని
కౌలురైతు సంఘం అనంతపురము జిల్లా ప్రధాన కార్యదర్శి నీళ్లపాల రామకృష్ణ ఆత్మకూరు మండల తాసిల్దార్ లక్ష్మీ నాయక్,కు గురువారం రోజున వినత పత్రం ఇవ్వడం జరిగింది.కేంద్ర రాష్ట్ర పాలకప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయి పాలకులు అధికారంలోకి రాకముందు రైతే రాజు రైతు లేనిదే రాజ్యము లేదు. అనిగొప్ప,ప్రగల్బాలు చెప్పడం అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన అ మాటలుఅన్ని అవిరి నీటి మూటలుగా మారుతున్నాయి. అందువలన రైతులు ప్రతిసంవత్సరము అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వైపు మల్లుతున్నారు ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతున్నది ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పైన పూర్తిగా దృష్టి సారించి రైతు డిమాండ్లను తక్షణమే పరిష్కారము చేయాలి.
డిమాండ్స్
ప్రత్యామ్మయవిత్తనాలు రైతులకు ఉచితంగా అందించాలి, యూరియా రైతులకు అందుబాటులోఉంచాలి, డా || యం.యస్. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం సి2౦50కు మద్దతు ధరల చట్టం అమలుచేయాలి,కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధ్యుత్ చట్టం 2022ను ఉపసంహరించాలి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, స్మార్ట్ మీటర్లు బిగించే పక్రియను రద్దు చేయాలి. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరంతో సహా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు విడుదల చేయాలి. ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన ప్రతి రైతుకు 20 వేలు సాగుసాయం తక్షణం అందించాలి.
రైతు రుణ విమోచనచట్టం తేవాలి. రైతుల రుణాలన్నింటిని ఒక పర్యాయం మాఫీ చేయాలి, పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలి. కౌలు రైతుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలి. 2013 భూ సేకరణ చట్టంలో రైతు వ్యతిరేక అంశాలను రద్దు చేయాలి. సమగ్ర పంటల భీమా పథకాన్ని సర్వే నెం. యూనిట్ గా అన్ని పంటలకు వర్తింపచేయాలి. భీమా రుసుం ప్రభుత్వాలే భరించాలి. 50 సంవత్సరాలు నిండిన రైతులు, గ్రామీణ పేదలకు నెలకు 10 వేలు పెన్షన్ ఇవ్వాలి. అటవీ హక్కుల చట్టం 2006ను కఠినంగా అమలు చేయాలి. సహజవనరుల దోపిడీని అరికట్టాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టేలా చట్టం రూపొందించాలని అంధ్రప్రదేశ్ కౌలురైతుసంఘము తరపున డిమాండ్ చేయడము జరిగింది.
పాల్గోన్నవారు రైతులు కే ఈశ్వరయ్య బ్రహ్మయ్య జావిడ్ వెంకటేశులు తిరపాలు తదితరులు పాల్గొన్నారు.

## హత్య ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం - పోలీసులకు కఠిన ఆదేశాలు




ధర్మవరం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
ధర్మవరం పట్టణంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఘోర హత్యా ఘటన స్థానికంగా కలకలం రేపింది. కేతిరెడ్డి కాలనీకి చెందిన తలారి లోకేంద్ర (మృతుడు), అనేక క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా, ధర్మవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్‌గా నమోదు అయ్యాడు. అతని మీద గతంలో ఒక మహిళా హత్య కేసుతో పాటు మరొక హత్య కేసు సహా పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.
ఈ రోజు జరిగిన ఘటనలో, గతంలో లోకేంద్ర చేతిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాసులరెడ్డి కుమారుడు బాలకృష్ణారెడ్డి, ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో లోకేంద్రపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. ఘటన చోటుచేసుకున్న వెంటనే మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం, ఈ విషయం పై వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కి మరియు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. ఈ ఘోర ఘటనపై మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరం పట్టణంలో అరాచక శక్తులకు అస్సలు చోటు ఇవ్వబోమని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మరల జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే ఎవరికైనా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ధర్మవరం పట్టణ ప్రజల్లో ఈ ఘటన ఆందోళన కలిగించినప్పటికీ, పోలీస్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన వెనుక ఎవరు ఉన్నా వారిని వదిలిపెట్టబోమని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిజానిజాలు వెలికితీస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

## మాస్టర్ సి సి వి నగర్ వినాయక లడ్డూ వేలం లక్షా రూపాయలకు కురుబ రాజేష్(ఆదోని) దక్కించుకున్న గణనాధుని ప్రసాదం

ఉరవకొండ , సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
ఉరవకొండ పట్టణంలోని మాస్టర్ సి సి వి నగర్ లిలిశ్రీ విద్య వినాయక ఉత్సవ సమితి 30వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వీరశైవ కల్యాణమండపంలో ప్రతిష్టించిన గణనాథుడి లడ్డూ వేలంపాటలో విశేష స్పందన లభించింది.
లడ్డును ఆదోని పట్టణానికి చెందిన లిలికురుబ రాజేష్ 1,01,116 రూపాయలక సొంతం చేసుకున్నారు. లడ్డూ తర్వాత మరిన్ని వస్తువులు కూడా వేలంపాటలో అమ్ముడయ్యాయి.

- వెండి చైన్ కురుబ రంజిత్ 26,10
- వెండి విగ్రహం గుండ్లపల్లి తిమ్మారెడ్డి 22,000
- కలశం%-% కురుబ సాయి నాథ్ 20,116
- వెండి కడియం శ్రావణ్ (స్పైస్ ఇన్ రైస్ రెస్టారెంట్) 16,500
- వెండి ఉంగరం కిరణ్ స్వామి 5,6. శాలువా,4,100

వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుని ప్రసాదాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ విద్య వినాయక ఉత్సవ సమితి కమిటీ సభ్యులు పాల్గొనగాభక్తాధులు పెద్ద ఎత్తున హాజరైలిలి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## గౌస్ మొద్దిన్ ఆధ్వర్యంలో ఘనంగా మహమ్మద్ ప్రవక్త గంధం వేడుకలు గౌస్ మొద్దీన్ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు, హాజరైన ప్రముఖులు



అనంతపురం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం మాజీ గ్రంధాలాయా చైర్మన్ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ గౌస్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో పామిడిలోని మసీదుకు గంధం సమర్పించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధం తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా విందు ఏర్పాటు చేసారు. ఈ విందులో టిడిపి ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ధర్మవరం టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పార్టీలకతీతంగా నాయకులు, మత పెద్దలు, నగరంలోని ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిరయతి గౌస్ మొద్దిన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా మిలాద్-ఉన్-నబి మహమ్మద్ ప్రవక్త జన్మదినం ముందు రోజు తన ఇంటి నుండి పామిడి నందు గల మసీదుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ గంధం తీసుకెళ్లే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహమ్మద్ ప్రవక్త ఆశీస్సులు అందరిపై ఉండాలని గౌస్ మొద్దీన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

AP 4PG 05 09 2025 FRIDAY qxp_Layout 1 05-09-2025 07:45 AM Page 2



## రూపా గార్డెన్ రెస్టారెంట్ కు నోటీసులు జారీచేసిన ఫుడ్ కమిషనర్ తస్లీం భాను



అనంతపురం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం అర్బన్ శ్రీకంఠం సర్కిల్లో ఉన్నటువంటి రూపా గార్డెన్ రెస్టారెంట్ ని ఆకస్మికతనికి చేసిన ఫుడ్ కమిషనర్ తస్లిం భాను ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రూప గార్డెన్ రెస్టారెంట్ పై పి జి ఆర్ ఎస్ లో బాధితులు నెల క్రింద బిరియాని చికెన్ కర్రీ తింటుంటే అందులో బొద్దింక రావడంతో కంప్లైంట్ చేశారని ఆ కంప్లైంట్ పై ఆకస్మిక తనిఖీకి రావడం జరిగిందని అలాగే రెస్టారెంట్లో డ్రైనేజ్ లైన్ పై మెస్సు లేకపోవడం కిచెన్లో కొద్దిగా అపరిశుభ్రత ఉండడంతో వారికి నోటీసులు జారీ చేశామంటూ అలాగే ఈ రూప గార్డెన్ రెస్టారెంట్ కు రెన్యువల్ అయిపోయి సంవత్సరం ఏడు నెలలు అవుతుందని దానిపై కూడా చర్యలు తీసుకుంటామంటూ మీడియాకు తెలపడం జరిగింది.

## జిల్లా ఎస్పీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన యమ్.యల్.ఏ.దగ్గుపాటి



అనంతపురం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ వి. జగదీష్ ఐపీఎస్ గారి పుట్టినరోజు సందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయం నందు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ మరియు, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు. యాదవ్ జిల్లా ఎస్.పి.కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## శింగనమల ఆర్ డి టి స్కూల్లో కో-ఆపరేటివ్ బ్యాంకు కాన్సెప్ట్పై అవగాహన కార్యక్రమం



శింగనమల, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
శింగనమల ఆర్ డి టి స్కూల్లో కో–ఆపరేటివ్ బ్యాంకు కాన్సెప్ట్పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శింగనమల, చిన్న మట్లగొంది, ఈ. నరసాపురం, చిన్న జలాలపురం, ఆకులేడు, నాగులగుడ్డం తాండా, జులకాలువ గ్రామాల నుండి సభ్యులు మరియు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని మండల దివ్యాంగులకు బాధ్యత తీసుకుని ఏర్పాటు చేశారు. మొత్తం 50 మంది హాజరయ్యారు.సంస్థ సిబ్బంది ఎస్ టి ఎల్ కృష్ణయ్య.బాలనారాయణ మరియు నేను కో–ఆపరేటివ్ బ్యాంకు యొక్క ముఖ్య ఉద్దేశ్యం, దాని ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాము.వారు సంతోషం వ్యక్తం చేస్తూ, మా అవసరాలను తీర్చుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపా

## ప్లాస్టిక్ రహిత పుట్టపర్తిగా మారుద్దాం - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




పుట్టపర్తి , సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
పుట్టపర్తి మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మారుద్దామని నియోజవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి ప్లాస్టిక్ రహిత పుట్టపర్తి మున్సిపాలిటీగా మారుద్దామని పుట్టపర్తి పట్టణ మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్టర్ ను ఎమ్మెల్యేగా ఆవిష్కరించారు. పుట్టపర్తి పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి ప్లాస్టిక్ రహిత పుట్టపర్తి మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పల్లె సిందూర పేర్కొన్నారు. పట్టణంలో ఫ్లెక్సీలు కూడా నిషేధించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు , ప్లాస్టిక్ బాటిల్లు విక్రయాలు పూర్తిగా నిషేధించేలా ప్రజల్లో మున్సిపల్ అధికారులు చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని బాగా తగ్గిస్తూ వాటిని పూర్తిగా నిషేధించేలా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకం ఎంతో ప్రమాదకరమని దీనివల్ల క్యాన్సర్ వంటి జబ్బులు ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువుగా ఉందని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి జనపనార సంచులు , బట్ట బ్యాగులు ప్రత్యేకంగా వాడితే ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఇకపై పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ , ఫ్లెక్సీలు వాడకం పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు

## శ్రీమంతమ్మకు హాజరైన మాజీ సర్పంచ్.



ఉరవకొండ , సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
ఉరవకొండ మండలం లత్తవరం గ్రామంలో కొడికి ఆనంద భార్య శిరీష శ్రీమంత కార్యక్రమానికి మాజీ సర్పంచ్ బోధపాటి గోవిందప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా గోవిందప్ప మాట్లాడుతూ శిరీష కు తాను ఆర్థిక సాయం అందించానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శింగనమల మండల పరిధిలోని నాగులగుడ్డం తాండ గ్రామంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



శింగనమల, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
నిన్నటి రోజున ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా రామాంజి నాయక్ ఆహ్వానం కేక్ కటింగ్ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.జనసేన యువ నాయకుడు తోటరామమోహన్
సింగనమల మండల పరిధిలోని నాగులగుడ్డం తాండ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం,జనసేన అధినేత గౌ"శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రామాంజి నాయక్ మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. రామాంజి నాయక్ ఆహ్వానం మేరకు సింగనమల గౌ"ఎంపీడీవో భాస్కర్ రాయల్(గబ్బర్ సింగ్ ఎంపీడీవో)ముఖ్యఅతిథిగా హాజరై పవన్ కళ్యాణ్ భావజాలం,వ్యక్తిత్వం గురించి ఆలోచన విధానం గురించి చాలా అద్భుతంగా వివరించడం జరిగింది. రామాంజి నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీడీవో.తెలియజేయడం జరిగింది.అలాగే సింగనమల మండల యువనాయకులు తోట రామమోహన్,మధు శేఖరులు హాజరై ఎంపీడీవో సమక్షంలో కేక్ కటింగ్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ,ఘనంగా నిర్వహించడం జరిగింది

## మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాలు




తాడిపత్రి, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ తాడిపత్రి నందు పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు సెప్టెంబర్ రెండవ తేదీ నుండి 12వ తేదీ వరకు వివిధ అంశాలపై అనగా పిసి – పి ఎన్ డి టి యాక్ట్ , లింగ వివక్షత, సెక్సువల్ రీప్రొడక్టివ్ హెల్త్ ,పోష్ యాక్ట్, స్కిల్ ప్రోగ్రామ్స్ అండర్ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ ,హెల్త్ అండ్ న్యూట్రిషన్ ప్రోగ్రామ్స్ వీటన్నిటిపై ప్రతిరోజూ క్యాలెండర్ వైస్ గా అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈరోజు తాడిపత్రిలోని టైలర్స్ కాలనీ లోని టైలర్స్ కాలనీ మరియు ఎస్ ఎస్ ఎస్ హై స్కూల్ తాడిపత్రి నందు లింగ వివక్షత వాటి పర్యావసనం తెలియజేస్తూ ఆడపిల్లలు తగ్గిపోతే సమాజంలో అసమానత్వం పెరుగుతుంది .దీని ప్రభావం భవిష్యత్తరాలపై ఉంటుంది. వివాహ సమస్యలు మహిళలపై హింసలు ఎక్కువగా ఉంటాయి. కావున లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధించాలి. ఆడబిడ్డ పుట్టుకను గౌరవించడం మరియు సమాన అవకాశం కల్పించడం మన అందరి బాధ్యత . ఆడపిల్ల పుట్టుకను రక్షించడం అంటే సమాజ భవిష్యత్తును రక్షించడమే అందరం కలిసికట్టుగా లింగ సమానత్వం మెరుగుపరచడానికి కృషి చేద్దాం.ఈరోజు ఈ కార్యక్రమము నందు సిడిపిఓ శ్రీమతి ఎస్ సాజిద బేగం, ఎస్ ఎస్ ఎస్ హై స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీ కె.సూర్యనారాయణ రెడ్డి, సూపర్వైజర్స్ శ్రీమతి బి లక్ష్మీదేవి ,శ్రీమతి పి. ఉమాదేవి , శ్రీమతి కె. రామలక్ష్మి ,జిఎంఎస్ కె , అంగన్వాడి కార్యకర్తలు అందరూ హాజరైనారు.

## బిఎస్ఎన్ఎల్ నూతన "బేసిక్ ప్లాన్" తో ఫైబర్ టీవీ నెట్వర్క్

- కేవలం 400 రూపాయలకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్
- 20 మెగా (బిట్స్ ఫర్ సెకండ్) హై స్పీడ్ అపరిమిత ఇంటర్నెట్




అనంత, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
బి ఎస్ ఎన్ ఎల్ టెలికాం సంస్థ "నూతన ఫైబర్ టీవీ బేసిక్ ప్రణాళిక" ను వినియోగదారులకు కోసం సరికొత్త ప్లాన్ ను అతి తక్కువ ధరలకు అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కేవలం 400 ల రూపాయలకే కొత్త ట్రిపుల్ ప్లే (ఎఫ్ టి టి హెచ్) ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ ను వినియోగదారులకు అందిస్తోంది . స్థానిక కేబుల్ ఆపరేటర్లు (ఎల్ సి ఓ) నుండి ఈ ప్లాన్ కు మంచి స్పందన లభిస్తోంది. కొంతమంది కేబుల్ ఆపరేటర్లు బిఎస్ఎన్ఎల్ లో భాగస్వామి ( టిప్) గా నమోదు చేసుకుని ఇప్పటికే (ఎఫ్ టి టి హెచ్) సేవలను ప్రారంభించారు. ప్రస్తుత భాగస్వాములు కూడా ఈ సేవలను అందించవచ్చు. ఇందులో 20 (మెగా బిట్స్ ఫర్ సెకండ్) వేగంతో అపరిమిత ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్ మరియు 400ం ఉచిత ఛానెల్ తో పాటు 44 తెలుగు పే ఛానెల్ లను వీక్షించవచ్చు. అంతేకాకుండా 9 (ఓ టి టి ఎస్) కూడా ఇందులో ఉన్నాయి. ఇంటర్నెట్ మరియు టీవీ చానళ్లను పొందడానికి 140 రూపాయలతో ప్రీ పెయిడ్ రీఛార్జ్ తప్పనిసరిగా చేసుకోవాలి. డిజిటల్ అగ్రిమెంట్ కోసం 500 రూపాయలను మాత్రమే చెల్లించి బిఎస్ఎన్ఎల్ లో భాగస్వామి (టిప్) గా నమోదు చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో (ఓఎల్టి) కనెక్టివిటీకి ఎటువంటి చార్జులు చెల్లించవలసిన అవసరం లేదు మరియు పట్టణ ప్రాంతాల్లో రూ.2500ంజీఎస్టీ మాత్రమే చెల్లించాలి. బిఎస్ఎన్ఎల్ లో భాగస్వామి (టిప్) గా ఉంటూ (ఎఫ్ టి టి హెచ్) సేవలను అందిస్తూ చాలామంది జీవనోపాధి పొందుతున్నందుకు అభినందిస్తున్నాము. ఆసక్తి గల ఆపరేటర్లు బిఎస్ఎన్ఎల్ లో భాగస్వామి (టిప్) గా నమోదు చేసుకోవడానికి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అనంతపురంలోని (పీజీఎం) కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని టెలికాం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ షేక్ మజీబ్ షాషా తెలిపారు

## క్రికెట్ ప్రియులను ఉత్సాహపరిచిన అటల్ బిహారి వాజ్పాయ్ స్మారక టోర్నమెంట్ సీజన్-2 పోటీలు.



ధర్మవరం, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
ధర్మవరం పట్టణంలోని ఆర్డిటి మైదానంలో గురువారం జరిగిన అటల్ బిహారి వాజ్పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2 16వ రోజు పోటీలు హెూరాహెూరీగా కొనసాగాయి. ఈ రోజు జరిగిన మూడు ఉత్కంఠభరితమైన మ్యాచ్లలో ఆరు జట్లు తమ ప్రతిభను ప్రదర్శించాయి. క్రికెట్ అభిమానులు ఉత్సాహంగా హాజరై ఆటగాళ్లకు హర్షధ్వానాలతో ప్రోత్సాహం అందించారు.


రోజు మొదటి మ్యాచ్ వేణు వారియర్స్ మరియు గొట్లూరు జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్కు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు టాస్ వేసి ఆరంభం చేశారు. ఆరంభం నుంచే రెండు జట్లూ సమానంగా పోటీపడగా, వేణు వారియర్స్ జట్టు 83/5 వికెట్ల నష్టానికి సాధించింది. అనంతరం బరిలోకి దిగిన గొట్లూరు జట్టు 88/7 స్కోరు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. గొట్లూరు జట్టు ఆటగాడు చైతన్య కుమార్ ఈ పోరులో తన అద్భుత ప్రతిభతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు.
రెండవ మ్యాచ్ ఫ్రెండ్స్–లెవెన్స్ మరియు సోమందపల్లి–లెవెన్స్ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్ను సీనియర్ క్రికెట్ ప్లేయర్ విశ్వనాథ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ పోరులో ఫ్రెండ్స్–లెవెన్స్ జట్టు 72 పరుగులకే ఆలౌట్ కాగా, సోమందపల్లి–లెవెన్స్ జట్టు కేవలం 4 వికెట్లు కోల్పోయి 78 పరుగులు సాధించి సులువుగా విజయం సాధించింది. ఈ మ్యాచ్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన కుమార్ (సోమందపల్లి–లెవెన్స్)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.
మూడవ మ్యాచ్ డ్రాగన్–లెవెన్స్ మరియు తారక్–లెవెన్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్ను ధర్మవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అరుణశ్రీ టాస్ వేసి ప్రారంభించారు. డ్రాగన్–లెవెన్స్ జట్టు బ్యాటింగ్లో అద్భుత ప్రతిభ కనబరిచి 134/4 పరుగులు చేసింది. సమాధానంగా బ్యాటింగ్ చేసిన తారక్–లెవెన్స్ జట్టు 100/4 పరుగులకే పరిమితమై, డ్రాగన్–లెవెన్స్ జట్టు 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ పోరులో చైతు (డ్రాగన్–లెవెన్స్) తన అద్భుతమైన ఆల్రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు.
మ్యాచ్ల అనంతరం విజేత జట్లకు మరియు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా ఎంపికైన ఆటగాళ్లకు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, బీజేపీ నాయకులు అనుగుతి రమణ, పెద్దకోట్ల ఆనంద్, కొంక నాగార్జున మరియు సీనియర్ క్రికెట్ ప్లేయర్ విశ్వనాథ్ జ్ఞాపికలు అందజేశారు.
ఈ టోర్నమెంట్ ద్వారా యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడమే కాకుండా, ధర్మవరం క్రికెట్ అభిమానులకు ఉత్సాహాన్ని నింపేలా ప్రతిరోజూ పోటీలు సాగుతున్నాయి

## మొక్కలను పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ అధికారిని నీలవేణి



కూడేరు, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
కూడేరు మండల కేంద్రంలో గురువారం రోజున ఫారెస్ట్ అధికారులు నీలవేణి ఎమ్మార్వో కాలనీ నందు, మరియు అరవకూరు కమ్మూరు గ్రామలలో ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె అన్నారు. రైతులు ఇంకా ఎవరైనా మొక్కలు నాటాలనుకున్న రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ తో కూడేరు మండల కేంద్రంలో ఫారెస్ట్ నర్సరీ నందు ఉచితంగా మొక్కలను పొందవచ్చని ఆమె తెలియజేశారు.

## గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా లోపాలు - సరిదిద్దండి, సర్పంచ్ హనుమంత రెడ్డి



కూడేరు, సెప్టెంబర్ 4 (అనంతప్రభ)
రాష్ట్రంలో రాబోయే మూడు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్న వేళ, గ్రామ పంచాయతీలలో ఓటరు జాబితాలలో లోపాలు వెలుగుచూశాయి. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు వార్డులలో నమోదవడం, డోర్ నంబర్ ఆధారంగా ఓటర్లను క్రమబద్ధీకరించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.దీంతో కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు వేర్వేరు వార్డులలో ఓటు హక్కు వినియోగించాల్సి రావడం, వార్డు సభ్యుల పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, ఓటరు జాబితాలను డోర్ నంబర్ వారీగా సరిచేసి, ఒకే కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు

## శ్రీ షిరిడి సాయిబాబాకు గురువారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ



కూడేరు, సెప్టెంబర్ 4 (అనంతప్రభ)
కూడేరు మండల కేంద్రంలోని నందు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం నందు గురువారం రోజున ఆలయ కమిటీ స్వామి వారికి వివిధ పూజ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని శ్రీ షిరిడి సాయి నాధుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా సన్నిధిలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రజిత రెడ్డి ఉద్యోగరీత్యా ఇతర దేశాలలో బిజీగా ఉండడం వల్ల సామాజిక మాధ్యమాలలో స్వామివారిని పూజా కార్యక్రమాలను వీక్షించి షిరిడి సాయిబాబాను దర్శించుకున్నారు.

## డెంగ్యూ వ్యాధితో బాలుడు తనీష్ మృతి"



ఉరవకొండ , సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన హరిజన రామాంజనేయులు భార్య సుహాసిని కి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె , రెండవ కుమారుడైన తనీష్ 6 సం డెంగ్యూ జ్వరంతో మృతి చెందాడు, గత శనివారం రాకెట్ల ప్రభుత్వ హాస్పిటల్ లో చూపించగా అక్కడ రక్త పరీక్ష కేంద్రం లేకపోగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు బాలుడని పరీక్షించిన తర్వాత మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, అక్కడ రెండు రోజులు చికిత్స పొందుతూ ఈరోజు మృతి చెందాడు.

## ఏపీఐఐసీ తో భూకొనుగోలు ఒప్పందం చేసుకున్న అగ్నేయస్త్రా కంపెనీ

పుట్టపర్తి, సెప్టెంబర్ 4 (అనంత ప్రభ)
అగ్నేయస్త్రా యూనిజెర్టిక్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు తమ పారిశ్రామిక అవసరాల కోసం మడకశిర మండలం ఆర్. అనంతపురం, గౌదెనహల్లి గ్రామాలలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఏపీఐఐసీ అధికారులతో భూమి కొనుగోలు ఒప్పందం చేసుకున్నారని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భూమి పొజెషన్ పొందిన వెంటనే పరిశ్రమ పనులను ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోహిత్, రమణ, ప్రియ, బీనతతో పాటు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

AP 4PG 05 09 2025 FRIDAY qxp_Layout 1 05-09-2025 07:45 AM Page 3











# డయాబెటిస్ ఉందా? అయితే పచ్చి మామిడిని తినడం ప్రారంభించండి



వేసవి వచ్చిందంటే మార్కెట్లో మామిడికాయలు, మామిడి పండ్లు సందడి చేస్తాయి. భారతదేశంలో ప్రజలు అత్యంతగా ఇష్టపడే పండ్లలో మామిడి పండ్లు కూడా ఒకటి. దీనిలో విటమిన్లు, మినరల్స్ డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యానికి చాలా మంచిది. మండుతున్న వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఈ పోషకాలన్నీ అవసరం. ఎక్కువ మంది మామిడి పండ్లను తినడానికి ఆసక్తి చూపిస్తారు కానీ, పచ్చి మామిడికాయను తినడానికి ఇష్టపడరు. కానీ పచ్చిమామిడిని తినడం కూడా చాలా అవసరం. ఇది శరీరానికి శీతలీకరణాన్ని అందిస్తుంది. వేడి నుంచి తట్టుకునే శక్తిని ఇస్తుంది. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ముందుంటుంది. వేసవిలో వచ్చే వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడడానికి శరీరానికి శక్తిని ఇస్తుంది. పచ్చి మామిడికాయలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు పెరుగుతామనే భయం అవసరం లేదు.

దయాబెటిస్ ఉంటే...

మధుమేహంతో బాధపడే రోగులు సీజనల్‌గా దొరికే పచ్చి మామిడికాయల్ని తినడం చాలా అవసరం. దీన్ని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా దయాబెటిస్ రోగం అదుపులో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలోనూ, తగ్గించడంలోనూ పచ్చి మామిడికాయ చాలా సహకరిస్తాయి. కాబట్టి వేసవిలో ప్రతిరోజూ పచ్చిమామిడి ముక్కలను తినడం అవసరం.

పచ్చిమామిడి కాయలు తినడం వల్ల మనకు కావాల్సిన రోజువారి విటమిన్ %ూ%లో 10 శాతం ఇది అందిస్తుంది. ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు ఇది చాలా అవసరం. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. మామిడిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇది రక్తప్రసరణ సవ్యంగా జరగడానికి అవసరం. రక్తప్రసరణ సవ్యంగా జరగడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఈ పోషకాలు రక్తనాళాలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా సహాయపడతాయి. అధిక రక్తపోటు రాకుండా అడ్డుకుంటాయి. తక్కువ రక్తపోటు ఉండటం వల్ల గుండెకు మంచిది. ఈ పచ్చి మామిడికాయలో మాంగిఫెరిన్ అని యాక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండెకు ఎంతో మేలు చేస్తుంది.

పచ్చి మామిడికాయలో ఒత్తిడిని తగ్గించే పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. పచ్చి మామిడికాయ తినడం వల్ల లుకేమియా, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, రొమ్ము వంటి క్యాన్సర్లు రాకుండా ఇది అడ్డుకుంటుంది. పచ్చి మామిడి కాయని ఈ రోజు నుంచే తినడం అలవాటు చేసుకోండి.

# వేసవిలో ఎటువంటి రోగాన్నైనా తగ్గించే అద్భుతమైన హోమ్ రెమిడీస్ చూడండి

వేసవిలో శరీరం అనేక సవాళ్ళని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత, డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. వడదెబ్బ, వేడి దద్దుర్లు సాధారణ సమస్యలు. వీటికి తోడు శ్వాసకోశ సమస్యలు తీవ్రమవుతాయి. వేసవి కారణంగా చెమట రూపంలో సోడియం, పొటాషియం వంటి అవసరమైన పోషకాలు క్షీణించిపోతాయి. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి హైడ్రేట్ గా ఉండటం, కాటన్ వస్త్రాలు ధరించడం, పీక్ అవర్స్ లో ఎండకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువ మంది ఈ టైమ్ లో జీర్ణక్రియ, చర్మం సమస్యలు, కాలానుగుణ ఫ్లూ, ఇన్ఫెక్షన్స్ బారిన పడుతూ ఉంటారు. వాటిని ఎదుర్కోవాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి. అటువంటి సమస్యలను పరిష్కరించగలిగే వంటింటి చిట్కాలు మీ కోసం..

అసిడిటీ కోసం లవంగం

అసిడిటీ సమస్య ఉన్నప్పుడల్లా ఒక లవంగం ముక్కని తీసుకుని చప్పరించండి. లవంగంలో ఉండే సహజ నూనె వల్ల అసిడిటీ సమస్యని తగ్గించడంలో సహాయపడుతుంది.

దగ్గు తగ్గించేందుకు ఖర్జూరాలు

పొడి దగ్గుతో బాధపడుతుంటే మీరు రెమిడీని ప్రయత్నించవచ్చు. 6 ఖర్జూరాలు తీసుకుని అర లీటరు పాలలో 25 నిమిషాల పాటు తక్కువ మంట మీద మరిగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి కనీసం మూడు సార్లు తీసుకుంటే మంచిది.

మైగ్రేన్ కోసం యాపిల్

రోజుకొక యాపిల్ తింటే డాక్టర్ కి దూరంగా ఉండవచ్చని అందరూ చెప్తుంటారు. మైగ్రేన్ నొప్పిని తగ్గించడంలో యాపిల్ సహాయపడుతుంది. అయితే దీన్ని ఖాళీ కడుపుతో మాత్రమే తినాలి.

మొటిమలు తగ్గించే దోసకాయ

దోసకాయలో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఖనిజాలు, విటమిన్లతో లోడ్ చేయబడి ఉంటాయి. ఇది చర్మానికి మేలు చేస్తుంది. తురిమిన దోసకాయని మెడ, మొహం, కళ్ళపై అప్లై చేసుకోవచ్చు. ఇది మొటిమలు, బ్లాక్ హెడ్స్ ని తొలగించడంలో సహాయపడుతుంది.

దగ్గుకి తులసి

అధిక వేడి కారణంగా చాలా మందికి వేసవిలో వేడి జలుబు చేస్తుంది. దీన్ని తగ్గించుకునేందుకు తులసి చక్కని హోమ్ రెమిడీ. వెల్లుల్లి రసం, తేనె సమాన పరిమాణంలో తీసుకుని అందులో తులసి రసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి మూడు సార్లు తీసుకుంటే దగ్గుని తగ్గిస్తుంది.

అల్సర్ కి తులసి ఆకులు

తులసిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు. ఇందులో యాంటాసిడ్ గుణాలు ఉన్నాయి. రోజుకి కొన్ని తులసి ఆకులు నమిలి మింగితే మంచిది. గ్యాస్ ఉబ్బరం, కడుపులో మంట, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించేందుకు సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో దోహదపడుతుంది.



# తేనెలో ఇవి కలిపి రాస్తే నల్ల మచ్చలు మాయం అవుతాయ్..!



తేనెలో అందరికీ అందుబాటులో ఉండేదే. దీనిలో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తేనెలో క్యాల్షియం, ఐరన్, సోడియం, ఫాస్ఫరస్, సల్ఫర్, పొటాషియం, విటమిన్ సి, బి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. తేనె ఆరోగ్యాన్ని రక్షంచడానికే కాదు.. సౌందర్య సంరక్షణకు సహాయపడుతుంది. తేనెలోని యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. చర్మ సంరక్షణకు మేలు చేస్తాయి. సూర్యరశ్మి, హార్మోన్ల మార్పుల, వృద్ధాప్యం కారణంగా.. చాలా మంది మహిళలు డార్క్ స్పాట్స్‌తో బాధపడుతుంటూ ఉంటారు. తేనె నల్ల మచ్చలను తేలికపరచి.. చర్మం రంగుతో సమం చేయడానికి సహాయపడుతుంది. మీరు నల్ల మచ్చలతో బాధపడుతుంటే.. ఈ ఐదు ఫేస్ మాస్క్ మీకు సహాయపడతాయి.

తేనె, నిమ్మరసం ఫేస్ మాస్క్..

ని మ్మరసం వంటి నేచురల్ స్కిన్ లైట్నర్స్ చర్మంపై డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో సహాయపడుంది. ఈ ఫేస్ మాస్క్‌ను తయారు చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ ఫ్రెష్ లెమన్ జ్యూస్ మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసిన తర్వాత.. 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.

తేనె, పసుపు ఫేస్ మాస్క్..

పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు మంటను తగ్గిస్తాయి, చర్మ సమస్యలను నయం చేస్తాయి. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెకు చిటికెడు పసుపు పొడి కలిపి మిశ్రమాన్ని తయారు చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి.. 10 – 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముఖంపై నల్లటి మచ్చలు తొలగుతాయి.

తేనె, దాల్చిన చెక్క ఫేస్ మాస్క్..

దాల్చినచెక్కలో యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉంటాయి. మొటిమలతో బాధపడేవారికి దాల్చిన మంచి మెడిసిన్ అనొచ్చు. అంతేకాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరచి.. డార్క్ స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఈ ఫేస్ మాస్క్ తయార చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి.. మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. మంచి రిజలట్స్ కోసం వారానికి రెండు సార్లు అప్లై చేయండి.

తేనె, బొప్పాయి ఫేస్ మాస్క్..

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, డార్క్ స్పాట్స్ రూపాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. పండిన బొప్పాయి గుజ్జు ఒక టేబుల్ స్పూన్ తీసుకుని, దానిలో తేనె కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ మిశ్మాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 – 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. మంచి రిజల్ట్స్ కోసం.. వారానికి ఒక సారి ఈ మాస్క్ అప్లై చేసుకోండి.

తేనె, కలబంద ఫేస్ మాస్క్..

కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు డార్క్ స్పాట్స్‌తో సంబంధం ఉన్న ఎరుపు, మంటను తగ్గిస్తాయి. దీనిలో చర్మానికి పోషణ ఇచ్చే.. విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఒక టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు మిక్స్ చేసి పేస్ట్‌లా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. డార్క్ స్పాట్స్ మాయం అవుతాయి.

# ఆరుబయట నిద్రపోతే ఎన్ని ప్రయోజనాలో తెలుసా? డోన్ట్ మిస్!

ఆరు బయట నిద్రపోవడం చాలామందికి ఇష్టం. ఎంత మంచి జ్ఞాపకమో అంటూ ఫ్లాష్ బ్యాక్ కి వెళ్లిపోతారు కూడా. అప్పట్లో వేసవి అని కథలుగా చెప్పే నడివయస్కులు మీకూ తెలిసే ఉంటారు. ఇప్పుడంటే అంతా ఏసి రూములకు అలవాటయ్యారు. కానీ ఇది వరకు వేసవి వచ్చిందంటే అందరూ ఆరుబయటో, డాబామీదో పడుకునేవారు. నీలాకాశం చూస్తూ నిద్రపోయే అదృష్టం ఈ జెనరేషన్ జనాలకు లేదు మరి. అప్పుడు ఉక్కపోత భరించలేక ఆరుబయట పడుకునే వారు. కానీ అదే ఆరోగ్యానికి మంచిదని కొత్తగా అధ్యయనాలు జరిపి రుజువులు చూపుతున్నారు శాస్త్రవేత్తలు.

ఏ సంఘటన బాధించి డిప్రెషన్ వచ్చేసినా కాసేపలా బయట పడుకుని ఆకాశం వంక చూడమని చెబుతున్నారు మానసిక నిపుణులు. అలా ఆరుబయట గడపడం మనసుకు ఉల్లాసం, శరీరానికి ఆరోగ్యం ఇస్తుందట. ఈ అపార్టుమెంటుల్లో ఆరు బయటకెక్కడికి వెళ్లేదీ అనకండి. సరదాగా అప్పుడప్పుడు కాంపింగులకైనా వెళ్లాలని సలహా ఇస్తున్నారు ఎక్స్ పర్ట్స్.

ఆరుబయట నిద్రపోతే సర్కాడియన్ రిథమ్ సమయం రెండు గంటలు వెనక్కి వెళ్లిందని ఈ మధ్యే జరిపిన ఒక అధ్యయనం ద్వారా నిరూపితమైందట. అంటే మీరు రెండు గంటల ముందుగానే నిద్ర లేచేస్తారన్న మాట. సర్కాడియన్ రీసెట్ అనేది శరీరం అలవాటు పడిన నిద్రా చక్రాన్ని మార్చడమని అర్థం. ఈ సర్కాడియన్ రిథమ్ మీద కాంతి, ఉష్ణోగ్రత వంటి రకరకాల కారణాలు ప్రభావం చూపుతాయి.

ప్రస్తుతం మన చుట్టూ పరిసరాల్లో అంతులేనంత ఆర్టిఫిషియల్ లైట్ ఉంది. ఆరుబయట సమయం గడపడం అంటే ఈ ఆర్టిఫిషియల్ లైట్ కి దూరంగా ఉండడం అని అర్థం. ఇంట్లో బెడ్ రూమ్ లో ఒక్కరే పడుకుంటారు. లేదా ఇద్దరుంటారు. అందులో ఒకరు నిద్ర పోవడమో లేక ఎవరి ఫోన్లు వారు చూస్తుండటమో చేస్తుంటారు. ఇలా కాకుండా ఆరుబయట బృందంగా అప్పుడప్పుడు పడుకుంటే కబుర్లలో సమయం గడుస్తుంది. తెలియకుండానే కన్నుమలిగి ప్రయత్నం లేకుండానే నిద్ర పట్టేస్తుంది. ఇది మనస్సు, శరీరం రెండూ రెజువనేట్ అయ్యేందుకు ఒక మంచి అవకాశమని అద్యయనాలు చెబుతున్నాయి.


ఒత్తిడి లేని జీవితాలు ఈ రోజుల్లో అంత సులభం కాదు. రోజులో దాదాపుగా 8,10 గంటల పాటు తీవ్రమైన ఒత్తిడిలోనే సగం జనాభా బతికేస్తున్నారు. ఇది నాడీవ్యవస్థ మీద, మెదడు పనితీరు మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. అనుక్షణం ఏదో ఒక యంత్ర శబ్ధంలోనే సమయం గడుపుతున్నాం మనం. అలాకాకుండా ప్రకృతిలోని సహజమైన శబ్ధాల నడుమ, బహిరంగ ప్రదేశాల్లో గడిపినపుడు మన శరీరంలో కార్టిసాల్ స్థాయి గణనీయంగా తగ్గడాన్ని గమనించారట. జర్నల్ ఎన్విరాన్మెంట్ అండ్ బిహేవియర్ లో చెట్లను చూస్తే ఒత్తిడి తగ్గడాన్ని గుర్తించినట్లు ఒక అధ్యయన ఫలితాలుగా ప్రచురించారు.

అర్ధరాత్రి వీచే చల్లని గాలిని ఏ ఏసి గాలితోనూ పోల్చలేము. ఇలా ఆరుబయట గడిపే సమయం చాలా మంచిదని మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తుందని పరిశోధనలు పునరుద్ఘాటిస్తున్నాయి. అందుకే వేసవిలో ఒక వారం పాటు అలా ఊరెళ్లి ఆరుబయట పడుకోవడం బెటర్. లేదంటే క్యాంపింగ్ చేసుకోవచ్చు కూడాను.



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటీకి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com